క్లుప్తంగా

తుది ఓటరు జాబితా తయారీకి సిద్ధం కావాలి



ఓటింగ్ పరికరాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు

కర్నూలు(సెంట్రల్): 2024 జనవరి 5వ తేదీ నాటికి తుది ఓటరు జాబితా తయారీకి సిద్ధం కావాలని ఆర్‌డీఓ హరిప్రసాదు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాల నిర్వహణ, ఫారం-6,7,8లను పరిష్కరించడంపై కర్నూలు రూరల్, సి.బెళగల్, గూడూరు మండలాల తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులకు మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓటింగ్ పరికరాల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 17లోపు ఫారం-6,7,8ను పరిష్కరించాలన్నారు.

వన్‌టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న టౌన్ డీఎస్పీ విజయ్‌శేఖర్

కర్నూలు (టౌన్): నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం టౌన్ డీఎస్పీ విజయ్‌శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను, స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించారు. కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వన్ టౌన్ సీఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

హార్మోనిస్టు గురువుకు కళాకారుల సన్మానం

కర్నూలు కల్చరల్: ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కళా దీక్ష కార్యక్రమానికి గురువుగా ఎన్నికైన ప్రముఖ హార్మోనిస్టు గురువు పీజీ వెంకటేశ్వర్లును స్థానిక కళాకారులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌లోని విశ్వ కళా సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతరాయచౌదరి, కళాకారులు వి.వి. రమణాచారి, డి.పుల్లయ్య, బైలుప్పల షఫీయుల్లా, బీసన్న, తిరుపాలు, హనుమంతు నాయుడు, శ్రీనివాసులు, రాఘవేంద్ర, తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కర్నూలు (టౌన్) : అశోక్‌నగర్‌లో 1200 ఎంఎం సామర్థ్యం కలిగిన ప్రధాన వాటర్ వర్క్స్ పైపులైన్ లీకేజీ పనులు పూర్తి కావడంతో అధికారులు నగరంలో నీటి సరఫరాను పునరుద్ధరించారు. మరమ్మతు పనులు వల్ల రెండు రోజుల పాటు అంటే ఈనెల 14, 15 తేదీల్లో నగరంలోని అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరాను నిలిపివేశారు.శుక్రవారం సాయంత్రానికి పనులు పూర్తి కావడంతో యథావిధిగా నీటిని సరఫరా చేస్తున్నట్లు నగరపాలక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవిప్రకాష్ నాయుడు తెలిపారు.

కర్నూలు-విజయవాడ మధ్య రెగ్యులర్ రైలు నడపాలి

కర్నూలు (రాజ్‌విహార్) : కర్నూలు నుంచి రాజధాని ప్రాంతం విజయవాడకు రెగ్యులర్ రైలును నడపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ శుక్రవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఓ ప్రకటనలో కోరారు. ఇక్కడి నుంచి వివిధ పనుల మీద విజయవాడకు వేల మంది రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు.

రోడ్డు దాటుతూ మహిళ మృతి

కర్నూలు టౌన్: రోడ్డు దాటుతూ ఓ మహిళ శుక్రవారం మృతి చెందింది. కల్లూరు మండలం దూపాడు గ్రామానికి చెందిన లావణ్య ప్రతి రోజు కర్నూలు నగరానికి చేరుకొని యాచక వృత్తి నిర్వహిస్తోంది. గురువారం సాయంత్రం స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా జోన్‌కు వెళుతున్న బస్సు ఢీ కొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

అమరజీవి చిరస్మరణీయులు



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు

కర్నూలు(సెంట్రల్) : అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆయన త్యాగం తెలుగువాళ్లు మరువలేనిదని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. శుక్రవారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి జేసీ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి వెంకట లక్ష్మమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని అన్నారు. నేటి యువత ఆయన అడుగు జాడాల్లో నడిచి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

తెలుగు ఆత్మగౌరవానికి ప్రతీక

కర్నూలు (టౌన్) : తెలుగు ఆత్మగౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు అని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, మేనేజర్ చిన్న రాముడు పాల్గొన్నారు.

అమరజీవి, వల్లభాయ్ పటేల్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతులను పురస్కరించుకొని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి ఎ.కరుణాకరబాబు నేతృత్వంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బతుకన్న, లాజరస్, ఖాజా హుస్సేన్, ప్రమిళ, సత్యరాజు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): స్వర్గీయ పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కల్లూరు ఎస్టేట్‌లోని సెట్కూరు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. సెట్కూరు సీఈఓ పీవీ. రమణ, మేనేజర్ సత్యనారాయణ వారి చిత్రపటాలకు పూలమాలు వేసి దేశానికి, రాష్ట్రానికి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు తాగునీటి కొరత లేకుండా చూస్తాం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీటి కొరత లేకుండా చూస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఏర్పాటు చేసిన ఏడు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ ఎంతో మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారని, వారిలో చాలా మంది ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇన్ పేషంట్లకు ఆయా విభాగాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్జికల్ వార్డులో 250 లీటర్లు, గైనిక్ విభాగంలో వెయ్యి లీటర్లు, సూపర్‌స్పెషాలిటి విభాగంలో వెయ్యి లీటర్లు, లేడీస్ హాస్టల్‌లో 250 లీటర్లు, మెన్స్ హాస్టల్‌లో 250 లీటర్లు, నర్సింగ్ హాస్టల్‌లో 500 లీటర్లు, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో 500 లీటర్ల ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణనాయక్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాన్స్ యాప్‌లో పిల్లల ఆరోగ్య పరిస్థితి



యూపీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సాన్స్ యాప్ ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సాన్స్ కార్యక్రమం సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశాలు పిల్లలను కలిసి సాన్స్ యాప్‌లో ఆ పిల్లల ఆరోగ్య పరిస్థితి వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం ఆ జాబితాను మెడికల్ ఆఫీసర్ యాప్‌కు పంపిస్తే ఆయన పిల్లల వివరాలు తెలుసుకుని వారికి తగిన చికిత్స చేస్తారన్నారు. అత్యవసర ఆరోగ్యసేవల కోసం సీహెచ్‌సీ, ఏహెచ్, జీజీహెచ్‌కు రెఫర్ చేస్తారన్నారు. ఏదైనా కారణం వల్ల టీకాలు వేసుకోలేకపోయిన గర్భిణిలు, పిల్లలకు వారికి మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించాలన్నారు. అనంతరం ఐఎల్ఆర్, డీఫ్రీజర్ పరిశీలించి టీకాలు సరైన పద్ధతిలో కోల్డ్‌చైన్ సిసమ్ట్ మెయింటేషన్ చేస్తున్నారా అని పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఏఎన్ఎంలు టీకాల కార్యక్రమానికి ముందు రోజు యూవిన్ పోర్టల్‌లో షెడ్యూల్ క్రియేట్ చేయాలన్నారు. ఫార్మాసిస్టులు ఉదయం 9 గంటలకు కంతా ఏఎన్ఎంలకు టీకాలు ఇచ్చి, వారిని టీకాల కార్యక్రమానికి త్వరగా మొదలు పెట్టేలా చూడాలన్నారు. పిల్లలకు, గర్భిణిలకు తగిన టీకాలు వేయించి ఆ వివరాలను యు విన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం



స్థానికులతో కలిసి జెండావిష్కరణ చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలోనే పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర క్లస్టర్-2 అధ్యక్షుడు కేదార్ నాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీరాం నగర్‌లో జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల మంజూరులో పేదలను వంచించిందని చెప్పారు. ఆ పార్టీకి ఓట్లు వేసిన వారికే ప్రాధాన్యత ఇచ్చిందని, అయితే సీఎం జగన్ ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసీఫ్, నాయకులు సూరీడు, షౌకత్ అలీ, రాజు, సుచరిత పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ తనిఖీ



యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న సమావేశానికి హాజరై జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రోగులు ఆరోగ్యమిత్ర ద్వారా రెఫర్ చేయించుకుని హాస్పిటల్‌లో వైద్యసేవలు పొందవచ్చన్నారు. అవసరమైతే ఆరోగ్యమిత్ర వద్ద ఉన్న డెస్క్‌టాప్‌పై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఆరోగ్యమిత్రలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

రగ్బీ పోటీలకు కేంద్ర క్రీడాధికారులు

కర్నూలు (టౌన్) : ఈనెల 18 నుంచి నగర శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్న రగ్బీ మహిళల పోటీలకు కేంద్ర క్రీడాధికారులు హాజరవుతున్నట్లు రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈనెల 19అండర్ 18 విభాగంలో మహిళలకు, ఈనెల 20 వ తేదీన సీనియర్ మహిళల కేటగిరీలో పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు రూ.3 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో ఉస్మానియా విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్

కర్నూలు (టౌన్) : రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ (పరుగు) పోటీల్లో ఉస్మానియా కళాశాలకు చెందిన విద్యార్థులు నబీ సాహెబ్, ఆర్. హేమంత్, లింగారెడ్డి పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులను శుక్రవారం కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ అజ్రా జావీద్ అభినందించారు. వ్యాయామా ఉపాధ్యాయులు రఫీక్ అహమ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ సమీయుద్దీన్, పట్టాబీ పాల్గొన్నారు.

17 న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 17 వ తేదీ స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య కమ్యూనిటీ హాలులో తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా తైక్వాండో సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 10, 12, 14, 16, 18, 20 సబ్ జూనియర్, జూనియర్, క్యాడెట్, సీనియర్ విభాగాల్లో కురుగురే, పుంసే వంటి క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 9849971256 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచండి

● ఆర్‌డీఓ హరిప్రసాద్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

ఓర్వకల్లు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న రానున్న నేపథ్యంలో శుక్రవారం మండలంలోని నన్నూరు జెడ్పీ హై స్కూల్‌లో విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద(మధ్యాహన భోజనం) పథకాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ప్రాణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ మనబడి నాడునేడు పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి పాఠశాల రూపురేఖలు మార్చిందన్నారు. విద్యా దీవెన పథకం ద్వారా అర్హులైన పేద విద్యార్థులకు కళాశాల చదువుల నిమిత్తం అవసరమైన ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుందని గుర్తు చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేయడం, నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం వడ్డించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, వీఆర్‌ఓలు శ్రీధర్, కృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారానికి అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. అందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు తెలంగాణలో కంటే ఏపీలో వెయ్యి రూపాయలు ఎక్కువగా ఇస్తామన్న సీఎం తన హామీ నిలబెట్టుకోవాలన్నారు. అలాగే పదవి విరమణ సమయంలో ఉండే జీతంలో సగం చొప్పున పెన్షన్ ఇవ్వాలన్నారు. విద్యార్హతను బట్టి ఉపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్‌వాడీల కుటుంబాలకు ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, నాగన్న, తేజోవతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం



కార్యక్రమంలో నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): అలుపెరగని పోరాటం ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైకె విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం సి.క్యాంప్ డ్రైవర్స్ అసోసియేషన్ భవనంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పరమేష్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్నామన్నారు. వర్గీకరణపై ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. అనంతరం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిపోగు భాస్కర్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సుభాష్ చంద్రబోస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాదిగ కళామండలి రాష్ట్ర అధ్యక్షులు రెడ్డిపోగు విజయ్‌కుమార్, ఆనంద్, ఆంద్రయ, గాదిలింగప్ప , దుర్గప్ప, సూరి, పాముల కుమార్, చైతన్య ఆనంద్, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు సత్య తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న ఎలక్ట్రోరోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): త్వరలో సాధారణ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై (ఈవీఎం) అవగాహన పెంచుకోవాలని ఎలక్ట్రోరోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ఈవీఎం ఏర్పాటు చేశారు. కర్నూలు మండల రెవెన్యూ కార్యాలయంలోనూ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో బూత్ లెవల్ ఆఫీసర్లు కాలనీల్లో ఈవీఎంలను ప్రదర్శించి ఎలా ఓటు వేయాలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్) : జీవో నెం 512ని రద్దు చేయాలని రిలే నిరాహారదీక్షలు చేస్తున్న న్యాయవాదులు తాజాగా ఈనెల 29 వరకు తమ విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం నాయుడు, ఎం.వి. చక్రపాణి ఆధ్వర్యంలో న్యాయవాద సంఘ అత్యవసర సమావేశం నిర్వహించింది. భూ హక్కు చట్టం రద్దు చేసే వరకు విధులను బహిష్కరించి పోరాడాలని పలువురు న్యాయవాదులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ధర్నా చౌక్‌లో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఐదోరోజు శుక్రవారం కూడా కొనసాగాయి. న్యాయవాదులు ఎస్.ఎం.ఖాద్రి, ప్రవీణ్ కుమార్, జి.శ్యామల సజ్జన్, జయసింహ, శ్యాంసన్, బాబు సాహెబ్ దీక్షలో కూర్చున్నారు. వీరికి పలువురు మద్దతు తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



గిరిజన శంఖారావం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో జనవరి 7న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే గిరిజన శంఖారావం పోస్టర్లను గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులు ఐక్యమత్యంతో ఉంటే మరింత అభివృద్ధి చెందుతారన్నారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి వారి ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కారం దిశగా కృషి చేస్తున్నానన్నారు. గిరిజన శంఖారావం బహిరంగ సభకు కుటుంబ సభ్యులతో తరలివచ్చి జయప్రదం చేయాలని రాజారాం నాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడంబాయ్ తాండ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, జిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపు



చాణిక్యపురి కాలనీలో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని 17 వ వార్డు చాణిక్యపురి కాలనీలోని పార్కు స్థలాన్ని ఆక్రమించిన తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడు ఏకంగా అక్కడ నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా బేఖాతరు చేయడంతో వారు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ శబరీష్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హరిష్ చౌదరి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం మూడో పట్టణ పోలీసుల సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఎవరైనా నగరపాలక స్థలాలను ఆక్రమిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. కాగా సమాచారం ఇవ్వగానే నగరపాలక అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించడం పట్ల చాణిక్యపురి కాలనీవాసులు ఎ. కృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తులను అలరించిన భక్తిరంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢ వీధిలోని నిత్యకళావేదికపై గుంటూరుకు చెందిన ధనలక్ష్మి సంగీత విద్యాలయం వారు నిర్వహించిన భక్తిరంజని భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతిస్తుతి, శివారాధన, బ్రహ్మమురారి, లింగా ష్టకం, మహిషాసురమర్ధిని, అఖిలాండేశ్వరి తదితర గీతాలను ఎం.ధనలక్ష్మి, లక్ష్మీలాస్య, జశ్వంత్, పూజ, ఇందుమతి, కార్తికేయ, జ్ఞాపి క, అక్షయ, విజ్ఞత, త్రినాథ్, నాగలక్ష్మీ, ప్రదీప్, పవన్, కోటేశ్వరరావు తదితరులు ఆలపించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. సీఎం జగనన్న నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే పెత్తందారులు తట్టుకోలేకపోతున్నారని, అసత్యారోపణలు చేస్తున్నారని విమర్శించారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలంటే ? అనే అంశంపై శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, మండల పరిషత్ అధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు హాజరయ్యారు. ముందుగా గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఆ తరువాత గ్రామ సచివాలయంలో ఆ గ్రామంలోని వారికి అందిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఒకప్పుడు ఈ పథకాల కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినా న్యాయం జరిగేది కాదన్నారు. ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హత ఉంటే చాలు ఇళ్ల దగ్గరకే పథకాలు చేరుతున్నాయని చెప్పారు. ఆధార్, రేషన్‌కార్డు తీసుకుని సచివాయానికి వెళ్తే ఏ పథకానికి అర్హులు అనే విషయం సిబ్బంది చెబుతున్నారన్నారు. ఉల్చాల గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.23,35,81,305 ప్రత్యక్ష, పరోక్ష విధానాల్లో లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అనురాధ, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సర్పంచ్ విద్యాసాగర్, నిడ్జూరు సత్యం రెడ్డి, గార్గేయపురం కౌశిక్ రెడ్డి, రవిరెడ్డి, గొర్రెల సొసైటీ చైర్మెన్ గోకారి, షేక్ ఖాలం, వార్డు సభ్యులు మల్లకల్, శ్రీధర్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.